# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ పర్యటనలో భాగంగా ఈరోజు 'సముద్ర సే సమృద్ధి' కార్యక్రమంలో పాల్గొననున్నారు.**

2. **రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ ప్రాంతాల్లో అక్రమ కట్టడాలకు జరిమాన విధించి క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం నిర్ణయించింది.**

4. **హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు.**

5. **ఆంధ్రప్రదేశ్‌లో ఉల్లి రైతులకు హెక్టారుకు 50 వేలు రూపాయల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు వెల్లడించారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ పర్యటనలో భాగంగా ఈ రోజు 'సముద్ర సే సమృద్ధి' కార్యక్రమంలో పాల్గొననున్నారు. భావ్‌నగర్‌లో 34 వేల 2 వందల కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని ప్రధాన మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. లోథాల్‌లో నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్‌ను సందర్శిస్తారని తెలిపింది.

--------------------------

రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శాసన సభలో నిన్న జలవనరుల శాఖపై జరిగిన లఘు చర్చకు ఆయన సమాధానమిస్తూ.. డిసెంబరు 25 నాటికి పోలవరం డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తామని వెల్లడించారు. శ్రీశైలం నుంచి కుప్పానికి కృష్ణా జలాలను తరలించినట్లు చెప్పారు. సోమశిల ప్రాజెక్టు మరమ్మతులు వచ్చే సీజన్‌కల్లా పూర్తి చేస్తామన్నారు. పోలవరం నుంచి బనకచర్లకు గోదావరి జలాలను తరలిస్తే రాయలసీమ సస్యశామలం అవుతుందని పేర్కొంటూ...

(వాయిస్.. 30 సెకన్లు)

అంతకుముందు శాసన సభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల మంత్రులు సమాధానాలు ఇచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ఈరోజు పల్నాడు జిల్లా మాచర్లలో పర్యటించనున్నారు. ప్రతీ నెలా మూడో శనివారం నిర్వహించే 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఉదయం మాచర్లకు చేరుకోనున్న ముఖ్యమంత్రి స్థానికంగా ఉన్న చెరువు పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు, పారిశుధ్య కార్మికులతో ఆయన మాట్లాడనున్నారు. అదేవిధంగా స్వచ్ఛ రథాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు.

---------------------------

హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా నిన్న నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కోటి మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారని వెల్లడించారు. ప్రస్తుతం 70 కిలోమీటర్లు ఉన్న మెట్రో పరిధిని 150 కిలోమీటర్లకు విస్తరిస్తున్నట్లు చెప్పారు. మెట్రోలో ప్రస్తుతం రోజుకు 5 లక్షల మంది ప్రయాణిస్తున్నారని, వచ్చే ఐదేళ్లలో ఈ సంఖ్యను 15 లక్షలకు పెంచాలన్నదే లక్ష్యమని, అలాగే మూసీ నదీ తీరాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. దీనికోసం మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. పర్యావరణ హిత విద్యుత్ వాహనాలను ప్రోత్సహిస్తున్నట్లు  ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం నిన్న జరిగింది. శాసన సభలోని ముఖ్యమంత్రి ఛాంబర్ లో నిర్వహించిన ఈ సమావేశంలో పట్టణ ప్రాంతాల్లో అక్రమ కట్టడాలకు జరిమాన విధించి క్రమబద్ధీకరించాలని నిర్ణయించారు. నాలా ఫీజు రద్దుకు సంబంధించి పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించిన వివిధ చట్టాలను సవరించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే కృష్ణా జిల్లాలోని తాడిగడప మున్సిపాలిటీగా పేరు మార్చే డ్రాఫ్ట్ బిల్లుకు సహా మొత్తం 13 బిల్లులకు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. ఆటో మిత్ర పథకంలో భాగంగా ఆటో కలిగి నడుపుకునే వారికి 15 వేల రూపాయలు ఇచ్చే ప్రతిపాదనకు కూడా రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉల్లి రైతులకు హెక్టారుకు 50 వేలు రూపాయల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఉల్లి రైతులకు మేలు చేసే ఈ  నిర్ణయం వల్ల ప్రభుత్వంపై సుమారు వంద కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందన్నారు. ఉల్లి రైతులందరికీ ఆర్థిక సాయం అందిస్తామని పేర్కొంటూ..

(వాయిస్... 28 సెకన్లు)

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది.. పునరుత్పాదాక ఇంధన శక్తి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

వాయిస్ ఓవర్

---------------------------

సాయుధ పోరాటానికి తాత్కాలిక విరామం ప్రకటిస్తూ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు అభయ్ ఒక శ్రవణ సందేశం విడుదల చేశారు. ఆయుధాలను విడిచి ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.

(వాయిస్.. 22 సెకన్లు)

మరోవైపు తాత్కాలిక సాయుధ పోరాట విరమణ పార్టీ నిర్ణయం కాదని మావోయిస్టు పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి జగన్ పేర్కొన్నారు.

---------------------------

వస్తు సేవల పన్ను- జిఎస్టీ సంస్కరణల్లో భాగంగా కొన్ని వస్తువులపై జిఎస్టీ శ్లాబ్‌లను సరళతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్‌లో వివిధ వర్గాల ప్రజలు హర్షం వక్తం చేస్తున్నారు. తాజా నిర్ణయంతో పేద, మధ్యతరగతి ప్రజలతోపాటు, చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వ్యాపారి సింహాద్రి లక్ష్మణ గుప్తా ఆకాశవాణితో తెలిపారు.

======================